


వివరాలు మెయిన్‌లో

**మత్తు పదార్థాల బారిన పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు**


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 19 నవంబరు , 2025 | పేజీలు : 08


## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే

# సిపిఐ పోరుబాట

### ప్రచార జాత సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బాలనర్సింహ్మా

### చండూరు, చింతపల్లి, మర్రిగూడ, కొండమల్లేపల్లిలో ప్రచార జాతకు సిపిఐ శ్రేణులు ఘనస్వాగతం

**ప్రజాపక్షం/చండూరు** : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆర్థిక అసమానతలు లేని సమసమాజమే లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ పోరుబాట నిర్వహిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, రాష్ట్ర పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. బాలనర్సింహ్మా అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, ఎం. బాలనర్సింహ్మా నేతృత్వంలో గద్వాల నుండి బయలుదేరిన ప్రచార జాత మంగళవారం సాయంత్రం చండూరు మండలానికి చేరుకున్న సందర్భంగా జాతకు చండూరు సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్‌కుమార్ ఆద్వర్యంలో ఘనస్వాగతం పలికారు. చండూరులోని గుండ్రపల్లి చౌరస్తాలో ఉన్న అమరుడు మందడి నర్సింహ్మారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు మండలంలోని తుమ్మలల్లి గ్రామానికి బస్సు జాత చేరుకోగానే సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామలింగయ్య ,మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ ఆద్వర్యంలో 100 బైకులతో చండూరు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తుమ్మలపల్లి గ్రామంలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, బంగారిగడ్డ చౌరస్తాలో రాష్ట్ర సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జినిరత్నాకర్ రావు సిపిఐ అరుణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం చందూరు చౌరస్తాలో నిర్వహించన సభలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం , ఎం.బాలనర్సింహ్మా , ఉజ్జిని రత్నాకర్ రావు మాట్లాడుతూ భారతదేశంలో 100 సంవత్సరాలు కలిగిన ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం పట్టణంలో 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాల బహిరంగ సభకు మునుగోడు గడ్డనుండి వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , తీర్పారి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, పార్టీ జిల్లా సమితి సభ్యులు తిప్పర్తి రాములు , మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు , బరిగెల వెంకటేశ్ , జెల్ల శ్రీను,దోటి వెంకన్న, బండమీది వెంకన్న, సిహెచ్ ఊషయ్య , గంట రమేష్, ఇరిగి సంజీవ, మాజీ జడ్‌పిటిసి మాదగోని విజయలక్ష్మి , బోయలపల్లి జంగయ్య, బిక్షమయ్య, మాజీ ఎంపిటిసి బి. రాములు , పల్లె నర్సింమ్మా, శివర్ల లింగస్వామి, జోగు రమేష్ , యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



### రాజీలేని పోరాటాల సారథి సిపిఐ

**ప్రజాపక్షం/చింతపల్లి** : భూమికోసం, భుక్తికోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పేదలను, కార్మిక, కర్షకులను దోపిడీ నుండి విముక్తి చేయడానికి దోపిడీ దారులకు, కార్పొరేట్ పెట్టుబడుదారులకు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వంద సంవత్సరాల నుండి రాజీలేని పోరాటాలను నిర్వహిస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. భారత గడ్డ పై భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల అఖిల భారతస్థాయి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ తలపెట్టిన జీపు జాత మంగళవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. మొదటగా సిపిఐ శ్రేణులు బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ మహాసభకు వేలాదిగా ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం బాలనరసింహ, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, జిల్లా సహయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, పల్లె నర్సింహ. శ్రీనివాస్, అంజయ్యనాయక్, బుచ్చిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రామస్వామి, రంగారెడ్డి, కనకాచారి, ఆంజనేయులు, మురళి, సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, అంజల్‌రావు, లక్ష్మ య్య, బుచ్చయ్య, శేఖరాచారి, శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న సిపిఐ

**ప్రజాపక్షం/మర్రిగూడ:** కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడు పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం మర్రిగూడ మండల కేంద్రానికి సిపిఐ శాతాబ్ది ఉత్సవ ముగింపు సభ విజయవంతానికి ఈనెల 15న, గద్వాల్ లో ప్రారంబమైన సిపిఐ బస్సు ప్రచార జాత మంగళవారం మర్రిగూడ మండల కేంద్రానికి చేరింది.ఈ సందర్బంగా పార్టీ శ్రేణులు జాతాకు డప్పు చెప్పుళ్లతో, బాణాసంచాలతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. జాతకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నర్సింహా,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ప్రజానాట్య నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కే.శ్రీనివాస్‌లను పూలమాలలతో సన్మానించారు. ఈ కర్యక్రమంలోమాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు.జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షం రెడ్డి,మండల కన్వీనర్ బుర్ర శేఖర్,మండల కార్యవర్గ సభ్యులు ఎరుకల నిరంజన్,జక్కల అంజయ్య,అయితేగోని వెంకటయ్య, ఎరుకలు యాదయ్య, కొట్టం యాదయ్య,జిల్లా బాలకిషన్,వేముల సత్తయ్య, కృష్ణయ్య, బొల్లం యాదయ్య,బోడ అంజయ్య,శిరసావాడ నరసింహ,అల్వాల నరసింహ, నజీర్,నల్లబోతు కొమరయ్య,రాధమ్మ పాల్గొన్నారు.

### రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** భారత రాజ్యాంగ హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు యం. బాలనర్సింహ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు మంగళవారం కొండమల్లేపల్లి మండలానికి చేరకున్న సిపిఐ ప్రచార జాతాలో అన్నారు. జాతకు సిపిఐ మండల నాయకులు మండలంలోని మటిల్డా పాఠశాల వద్ద ఘనస్వాగతం పలికి భారీ ర్యాలీతో చౌరస్తాకు చేరుకున్నారు. అనంతరం బాలనర్సింహ, ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వంలో నిరుద్యోగం, రైతు ఆత్మహత్యలు పెరిగాయన్నారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పల్లా నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు బుచ్చిరెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, సహాయ కార్యదర్శి శేఖరాచారి, చరణ్‌రెడ్డి, సోమ్లానాయక్, ఆంజనేయులు పాల్గొన్నారు.









## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

**ప్రజాపక్షం/మునగాల:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేసుకోవాలని జడ్పీ సిఇవో శిరీష అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తాడ్వా యి తండా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులు నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం షెగ్రిగేషన్ షెడ్డును, పల్లె దావకాన నూతన భవనాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఎంపిడివో రమేష్ దీన్‌దయాల్, ఎం పి వో నరేష్, ఎపివో శైలజ, పంచాయతీ కార్యదర్శి , వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం స్థాపించాలి



**ప్రజాపక్షం/మునగాల:** డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు ఉద్యమించాలని తహసిల్దార్ సరిత అన్నారు. మంగళవారం మాదక ద్రవ్యాల నిరోధక చట్టం ప్రకారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణ చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రమేష్ దీన్‌దయాల్, ఎపివో శైలజ, ఇజిఎస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దాతలు సహకరించాలి

**ప్రజాపక్షం/మునగాల:** మండల కేంద్రంలోని నాగార్జున సాగర్ ఎడమకాలువపై శ్రీహర హర సుత అయ్యప్ప స్వామి దేవాలయంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని దేవాలయ కమిటి చైర్మన్ తడకమళ్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం దాతలు భాగం వెంకటరమణమహేశ్వరి దంపతులు పదివేల రూపాయలు, పచ్చిపాల శ్రీనివాస్‌ఎల్లమ్మ దంపతులు 50 కేజీల బియ్యం, మంచికంటి జనార్ధన్‌జానకిరమణి దంపతులు 25 కేజీల బియ్యం, వెంకట సురేష్ చంద్రకళ దంపతులు 25 కేజీల బియ్యం దాతల సహకారంతో అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటి సభ్యులు, మాలలు ధరించిన అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.



# డ్రగ్స్ నిర్మూలనకు సహకరించాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** డ్రగ్స్ నిర్మూలనకు విద్యార్థిని విద్యార్థులు తమకు సహకరించాలని హుజూర్‌నగర్ పట్టణ ఎస్ఐ బండి మోహన్‌బాబు కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి శ్రీను అధ్యక్షతన డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు విద్యార్థి దశలో బానిసలు అయితే జీవితం నాశనం అవుతుందన్నారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పర్చుకొని కష్టపడి చదివి మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. డ్రగ్స్, గంజాయి, ఆల్కాహాల్ వంటి మత్తు పదార్థాలు తమ పరిసరాలలో గుర్తించినట్లయితే 100కి గాని, 1930 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో తమవంతు పాత్ర పోషిస్తామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బలరాంరెడ్డి, కళాశాల అధ్యాపకులు బ్రహ్మాచారి, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారావు, నాగుల్ మీరా, రమణారెడ్డి, సూరారెడ్డి, శోభారాణి, ఉపేంద్ర, హరుణ్, జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో అన్నదానం సంతోషం

**ప్రజాపక్షం/మునగాల:** వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించడం చాల సంతోషంగా ఉందని చింతలపాలెం తహసిల్దార్ తుమ్మల సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముకుందాపురం గ్రామ శివారులో ఉన్న ఇందిర ఆనాధ వృద్ధాశ్రమంలో చింతలపాలెం తహసిల్దార్ సురేందర్‌రెడ్డి, లక్ష్మి దంపతుల కుమారుడు రితికేష్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బాబు పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు, మానసిక వికలాంగులకు, ఆనాధలకు పండ్లు, అన్నదానం చేయడం చాల సంతోషంగా ఉందని, అలాగే ప్రతి ఒక్కరు సామాజిక దృక్పదంతో సేవ భావాన్ని కలిగి ఉండాలని, తమ తమ గృహాలలో జరిగే కార్యక్రమాల సందర్భంగా ఇలాంటి అశ్రమాల్లో ఉన్న వారికి తమకి తోచిన విధంగా సహయ సహకారాలు అందించి వారికి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.



## టిపియుఎస్ నూతన మండల కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/వలిగొండ :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం టిపియూఎస్ వోలిగొండ మండల శాఖ అధ్యక్షుడిగా వైవిఎన్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. ఎన్నికల పర్యవేక్షకులుగా జిల్లా అధ్యక్షులు బంధారపు లింగస్వామి హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశభక్తి సాంస్కృతిక సాంప్రదాయాలను పరిరక్షించుకోవడం కోసం పరితపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెండింగ్ డిఏలు, పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు పొట్లపల్లి స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు హుక్కుర్తి లక్ష్మణ్, వేణు రెడ్డి, వెంకటేశం, రమణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





## చిన్నారులకు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/మోతె :** మంగళవారం మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డులోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నామవరం మాజీ సర్పంచ్ మట్టిపల్లి వెంకన్న మనుమరాండ్ల పట్టు వస్త్ర అలంకరణ వేడుకలకు ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అక్షింతలు వేసి దీవించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి పుల్లారావు, కిసాన్ సెల్ కోఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు వీరన్న, వెంకన్న, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులో ప్రతిభ చాటిన గిరిజన బిడ్డ



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం ఎంహెచ్ఎస్ఆర్‌బి మెడికల్ బోర్డు రిలీజ్ చేసిన మెడికల్ డిపార్ట్మెంట్లో గ్రేడ్ 2 పోస్టుల ఫలితాలలో యాదాద్రి భువనగిరి జిల్లా, తుర్కపల్లి మండలం సంగ్యతండాకు చెందిన సర్వన్ నాయక్ కూతురు, ధీరావత్ మమత ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబంలో పుట్టి స్థానిక పాఠశాలలో విద్యాబాసం పూర్తి చేసి, వివాహం చేసుకున్నప్పటికీ చదువు మీద ప్రేమత, చదవుని నెగ్లెట్ చేయకుండా తన విద్యను కొనసాగించింది. ఎంతో కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడం జరిగిందని మమతకు వారి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, తుర్కపల్లి మండల వాసులు అభినందనలు తెలియజేశారు. తుర్కపల్లి మండలంలో ప్రతి విద్యార్థి మంచి చదువు,మంచి ప్రతిభతో ఉద్యోగాలు సాధించి అటు కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు, పెరిగిన మండలానికి మంచి పేరు తేవాలని పలువురు అభిప్రాయపడ్డారు.

## టోల్ ఫ్రీ నెంబర్లపై అవగాహన



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** బాలల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఆత్మకూరు మండలం కస్తూర్బా పాఠశాలలో బాలల హక్కులు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన,1098,100,112 టోల్ ఫ్రీ నెంబర్ల తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడబ్ల్యూసి మెంబర్ కునగల మల్లేశం మాట్లాడుతూ బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని భవిష్యత్తుకు బడిలోనే పునాదులు వేసుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పాఠశాల ఎస్ఓ పద్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్కోప్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ కురిమేటి యాదయ్య, పారా లీగల్ వాలంటీర్లు కానుగంటి శ్రీశైలం, అలుగోజు విజయలక్ష్మి, ఎండి మౌలానా, డిసిపియు యూనిట్ సభ్యులు శ్వేత, ఉపాధ్యాయునీ సిబ్బంది రచ్చ భారతి, సరిత, అంజుమారా, జవీద్ సుల్తానా విద్యార్థినిలు పాల్గొన్నారు.

## చేప పిల్లల పంపిణీ



**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం) :** మండలంలోని అన్ని గ్రామాల సొసైటీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ ప్రభుత్వ విప్‌శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, మత్స్య పారిశ్రామిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెట్టు సాయి కుమార్, రాష్ట్ర కార్యదర్శి జానకిరామ్, జిల్లా మత్స్య శాఖ అధికారి రాజారావు, మత్స్య పారిశ్రామిక సంఘం మండల అధ్యక్షులు ఎద్దు వెంకటేశ్వర్లు సహకారంతో పల్లెపహాడ్, పారుపల్లి, కొరటికల్, మోరిపిరాల, రహీంఖాన్ పేట, ఖప్రాయిపల్లి, తుక్కపురం, కూరెళ్ళ, రాయిపల్లి, పల్లెర్ల సొసైటీలకు చేప పిల్లలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్ ఆఫీసర్ సలీం, నరేష్, చరణ్, సయిాద్, సొసైటీల అద్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

## రైతువేదికలో అగ్రి లీగల్ క్లీనిక్

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల కేంద్రంలోని రైతువేదికలో లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అగ్రి క్లీనిక్ ఏర్పాటు చేశారు. ఈ క్లీనిక్‌లో లీగల్ సర్వీసెస్ నుంచి కానుగంటి శ్రీశైలం హాజరయ్యారు. ఇక్కడ రైతులకు కావాల్సిన భూచట్టాలు, వయో వృద్ధులు సంక్షేమం, వ్యవసాయ అనుబంధ న్యాయ సలహాలు అందించడం జరుగుతుందన్నారు. ఏదైనా సమస్యలు ఉన్న ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో ఇక్కడ క్లీనిక్‌లో అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు.



## తెలంగాణ మెడికల్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/ రామన్నపేట:** స్థానిక ఏరియా ఆసుపత్రిలో మంగళవారం ఆసుపత్రి సిబ్బంది తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలుగా నర్సింగ్ సూపరింటెండెంట్ 2 జే.రాణి, అధ్యక్షులుగా సువర్ణ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా టి.శ్రీనివాస్, కార్యదర్శిగా కేఏ.సోలి, కోశాధికారిగా జ్యోతి, షాజియా శిబా, వాసంతి, రేష్మా, సతీష్, సుశీలలు ఎన్నికయ్యారు.

## యువత చెడు అలవాట్లకు దూరం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వన్ టౌన్ ఎస్ఐ సైదిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో విద్యార్థులకు డ్రగ్స్ వాటి ప్రభావంపై అవగాహన కల్పించి ఆయన మాట్లాడారు. యువత చిన్న వయస్సు నుంచి డ్రగ్స్‌కు బానిసలై తమ బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని అన్నారు. ఎవరైనా డ్రగ్స్ అమ్మినా, కొన్నా తమకు సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. యువత సోషల్ మీడియా పట్ల దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కెకె.జయరాజన్, హెచ్‌ఎం సుజయ్‌కుమార్, డైరెక్టర్ జిన్సీ జయరాజన్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భ్రూణ హత్యలకు పాల్పడితే శిక్షలు

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలం శెట్టిపాలెం హైస్కూల్‌లో బేటి బచావో బేటి పడావో కార్యక్రమము నిర్వహించారు ఈ సందర్భంగా సిడిపిఓ చంద్రకళ మాట్లాడుతూ మాట్లాడుతూ కిశోర బాలబాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు.పిల్లలకు అక్రమ దత్తత,శిశువిక్రయాలు,భ్రూణ హత్యలకు పాల్పడితే శిక్షలు తప్పవని వాటికి అవసరమయ్యే హెల్ప్ లైన్లు 1098 ,100 నెంబర్ల కు తెలియజేయాలన్నారు. సూపర్వైజర్ పరిమి రజిని ప్రధానోపాధ్యాయులు నీలం సత్యనారాయణ,టీచర్స్ తిరుపతి,హేమ,రాజశేఖర్,సతీష్ రెడ్డి ,రేణుక అంగన్వాడీ టీచర్ సుభద్ర,బాల బాలికలు పాల్గొన్నారు.



# బిసిలపై అన్ని పార్టీలది డొల్ల ప్రేమ




ప్రజాపక్షం/ మిర్యాలగూడ: బీసీలపై అన్ని పార్టీలది డొల్ల ప్రేమ అని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులు గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 42శాతం బీసీ రిజర్వేషన్లపై డ్రామా నడుస్తుందని విమర్శలు అంటున్నది నిజమేనని అందుకు నిదర్శనమే ఒక పార్టీ రిజర్వేషన్లకు అనుకూలమని ప్రకటిస్తూ అసెంబ్లీ తీర్మాణంలో భాగస్వామ్యం అయి కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి లేకుండా నిరసన డ్రామాలాడడం, ఇంకొక పార్టీ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు మద్దతు అని ప్రకటిస్తూనే వారే కేంద్రంలో అడ్డుపడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపడం మరొక డ్రామా అని, అన్నిటికంటే ముఖ్యంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేది మేమే అని ప్రకటించి అసెంబ్లీలో తీర్మాణం చేసి రోడ్లపై డ్రామాలాడుతూ పార్లమెంట్‌లో బిల్లుపై ఒత్తిడి తేవకపోడం, పార్లమెంట్‌లో ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉన్నా ప్రైవేట్ బిల్లు పెట్టకుండా ఇంకొక డ్రామా ఆడడం చూస్తుంటే ఇదంతా డ్రామా అని ప్రజలకు అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా బీసీలు మేల్కొని పార్టీలు ఆడుతున్న డ్రామాల పట్ల అప్రమత్తంగా ఉండి రిజర్వేషన్ల సాధనకై పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సరికొండ రామకృష్ణరాజు, కర్నాటి శివరామకృష్ణ, గుణగంటి వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

## పార్టీపరంగా సర్పంచ్ ఎన్నికల్లో బిసిలకు రిజర్వేజన్లు సరికాదు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పార్టీపరంగా సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించడం సరికాదని రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. డిసెంబర్ 1 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ బీసీ రిజర్వేషన్లపై పోరాడాలని బీసీ రిజర్వేషన్లు పెంచకుండా సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్యాబినేట్ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. రిజర్వేషన్లను పార్టీ పరంగా కాకుండా చట్టపరంగానే 42శాతం బీసీ రిజర్వేషన్లను కల్పించే విధంగా వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అఖిలపక్షాన్ని వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి తీసుకెళ్లాలని, రాహుల్‌గాంధీ తెలంగాణ రాష్ట్రానికి సంబందించిన రిజర్వేషన్ల గురించి ప్రైవేట్ బిల్లు పెట్టాలని అన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామన్నారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, గుండెబోయిన నాగేశ్వర్‌రావుయాదవ్, మహేష్, సుధాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌సి కమిటీ రిపోర్టును అమలు చేయాలి

**ప్రజాపక్షం/వేములపల్లి:** పిఆర్‌సి కమిటీ రిపోర్టును వెంటనే అమలు చేయాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి నాగమణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ సిపిఎస్‌ని రద్దు చేయాలని, సర్వీసులో ఉన్న టీచర్లకు టెట్ నుంచి మినయించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏ లను మంజూరు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు అమలు చేయాలని, కేజీబీవీ సిఆర్‌టి లకు టైమ్స్ స్కేల్ మంజూరు చేయాలన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా బైరం బాలరాజు,ప్రధాన కార్యదర్శిగా మోటే రమాదేవి, ఉపాధ్యక్షులుగా చిట్యాల జానయ్య, గాదరి యాదమ్మ కోశాధికారిగా మాడుగుల సుమన్,కార్యదర్శులుగా పి శ్రీనివాస్,సిహెచ్ సైదులు, డి రవీందర్, కె హరిత, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన మండల కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ముర్తాల శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ప్రధానోపాధ్యాయులు బూరుగు రమేష్ పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను పరిశీలించిన సైనిక్ స్కూల్ ప్రతినిధులు



**ప్రజాపక్షం/నందికొండ:** సాగర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను మంగళవారం సైనిక్ స్కూల్ ప్రతినిధుల బృందం పరిశీలించింది. విశాల మైదానం సొంతభవనాలు కలిగి ఉన్న 21 పాఠశాలలను సైనిక్ పాఠశాలలుగా మార్చాలనే ఉద్దేశంతో వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయ సంస్థ సెక్రటరీ సైదులు ఆదేశాల మేరకు ఈ ఏడాది జులైలో సైనిక్ స్కూల్ అథారిటీకి దరఖాస్తు చేయడంతో మంగళవారం సైనిక్ స్కూల్ ప్రతినిధులు బృందం తమ పాఠశాలను పరిశీలించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు ఈ సందర్భంగా వారు దరఖాస్తులో పొందుపరిచిన అంశాలను పరిశీలించడంతోపాటు నల్లగొండ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ శ్రీనివాసులు సమర్పించిన పత్రాలను కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ కు చెందిన సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి పృథ్వీరాజ్ తనిఖీ చేశారని దరఖాస్తు చేసుకున్న సమయంలో జతపరిచిన అన్ని అంశాలకు సంబంధించిన పత్రాల పట్లసంతృప్తిని వ్యక్తం చేయడంతోపాటు పరిశీలన నివేదికను తమ ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలియజేసారని ప్రిన్సిపాల్ రవి కుమార్ తెలిపారు. వీరితో ఎంజెపిబిసి గురుకుల ఆర్‌సిఓ స్వప్న ఉన్నారు.






## విద్యార్థులచే డ్రగ్స్ నిరోధక ప్రతిజ్ఞ

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని మునిపంపుల జడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం విద్యార్థులచే డ్రగ్స్‌నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాలతో జీవితాలు, సంబంధాలు ఎలా దెబ్బతింటాయో ప్రధానోపాధ్యాయుడు దొడ్డి స్వామి విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ భూతం వేషధారణలో విద్యార్థి ప్రతిజ్ఞ చెప్పడం ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో... నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మంగవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ నివారణపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత డ్రగ్స్ భారిన పడకుండా ఉండాలని, డ్రగ్స్‌తో జీవితాలు నాశనమవుతాయని అన్నారు. తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీవో రాములు, ఎస్ఐలు యుగంధర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ సమస్యల పరిష్కారం



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీలోని 10 వార్డులలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామని మున్సిపల్ కమీషనర్ మల్లేశం తెలిపారు. మునుగోడు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రేస్ పార్టీ మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్,కమీషనర్ మల్లేశం మున్సిపల్ సిబ్బందితో కలిసి 1,6,7,8,9 వార్డులో మంగళవారం ఇంటింటికి తిరుగుతూ వార్డులలో ఉన్న సమస్యలను రికార్డు చేసుకున్నారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్ యాదవ్, మాజీ కౌన్సిలర్ మంచుకొండ కీర్తి సంజయ్ , నల్లగంటి మల్లేశం , సంకోజు బ్రహ్మం, కారింగు రాంమూర్తి, గండూరి జనార్దన్ ,కల్లెట్ల మారయ్య, బెల్లంకొండ శేఖర్ పాల్గొన్నారు.

## బీమా ప్రతి ఒక్కరి జీవితానికి ధీమా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఆరోగ్య భీమా ప్రతి ఒక్కరి జీవితానికి ధీమానిస్తుంది అడిషనల్ ఎస్పి రమేష్ పేర్కొన్నారు.జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సూచలన మేరకు మంగళవారం అడిషనల్ ఎస్పి సమక్షంలో హెచ్‌డిఎఫ్‌డిసి,యాక్సిస్ బ్యాంక్ వారి ఆధ్వర్యయంలో హోం గార్డ్ సిబ్బందికి ఆరోగ్య భీమాపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆరోగ్య బీమా అనేది ప్రతి ఒక్కరికి ఎంతో అవసరం అని తెలిపారు. సంబంధిత బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ హెచ్‌డిఎఫ్‌డిసి యాక్సిస్ బ్యాంకులలో ఖాతా కలిగిన సిబ్బంది ప్రతి సంవత్సరానికి రూ.11,650 లు ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లిస్తే కుటుంబంలోని నలుగురు భార్య ఇద్దరు పిల్లలకు 33 లక్షల వరకు ఆరోగ్య భీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు,హోం గార్డ్ ఆర్ఐ శ్రీను,హెచ్‌డిఎఫ్‌డిసి బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ,యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఇన్సూరెన్స్ అధికారులు,హోం గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



# రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**ప్రజాపక్షం/చండూరు:** అకాల వర్షాలతో పంట నష్ట పోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపి ఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన చండూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అకాల వర్షాల ప్రభావంతో పత్తి, వరి పంటలు తీవ్రంగా దెబ్బ దిన్నాయని అన్నారు. పత్తి కొనుగోలులో ఎలాంటి కొర్రీలు లేకుండా కొనుగోలు చేయాలని, తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయెద్దన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 30వేల నష్టపరి హారాన్ని చెల్లించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్య దర్శి జేరిపోతుల ధనుంజయ్య గౌడ్, చిటటిమల్ల లింగయ్య వెంకటేశం, నర్సింహ్మా, వెంకన్న ,స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి పట్ట ణంలో అర్బన్ కాలనీ 16వ వార్డ్‌కు చెందిన చేనేత కార్మికుడు బొద్దుల సుధాకర్(మొగ్గమ్)నేత గత రెండు నెలల క్రిందట గుండెపోటుతో కస్మిక చనిపోయాడు. బీడీ కార్మికురాలు బొద్దుల రాజేశ్వరి ఇంటికి మాజీ కౌన్సిలర్ జిల్లా గ్రంధాలయం డైరెక్టర్ పోలిశెట్టి ఫౌండే షన్ చైర్మన్ పోలిశెట్టి అనిల్ కుమార్ వెళ్లి వారి భాధలు విన్నారు. వారి కుటుంబంనికి పోలిశెట్టి ఫౌండేషన్ ద్వారా రూ.5000 ఆర్థికంగా సహాయం చేసి ఒక నెలకు సారపాడు సరుకులను అందజేశారు. భవిష్య త్‌లో వారి కుటుంబంకీ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వస్తుపుల అభినేయ, బాలు గోపి, రమేష్ సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి పీడియాట్రిషన్ ఫ్రోరం సంయుక్త చైతన్య టెక్నో స్కూల్లో చిన్నపిల్లలకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఉచితంగా మందుల పంపిణీ చేశారు. పిల్లలు ఆరోగ్యవంతంగా ఉండా లంటే తల్లిదండ్రులు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవా లని డాక్టర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోహన్, శ్రీకృష్ణ చైతన్య, కరెంట్ రెడ్డి, సురేష్ కుమార్, హర్షిత ఈశ్వర్, ప్రశాంత్ డాక్టర్లు పాల్గొన్నారు.

# గిరిజన నిరుద్యోగ యువత కోసం డిఇఇటి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ ప్రభుత్వం గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశ ములు కల్పించడానికి డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డిఇఇటి) అంతర్జాలమును ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం ఒక ప్రకనటలో తెలిపారు. ఈ డిఇఇటి వెబ్‌సైట్‌లో గిరిజన నిరుద్యోగ యువతి, యువకులు పూర్తి వివరాలను నమోదు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె నరసింహ రావు కోరారు. మంగళవారం నశా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవాలను పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి దిశగా కృషి చేయాలన్నారు. జిల్లా అబ్కారి అధికారి లక్ష్మా నాయక్, డిప్యూటి డిఎంహెచ్ఓ చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ డ్రగ్స్ యొక్క రకాలు వాటి వినియో గం వల్ల కలిగే నష్టాలను వివరించారు. యువత ఏ విధంగా డ్రగ్స్ వల్ల తమ జీవితాలను కోల్పోతున్నదో కొన్ని కేసులను వివరించారు. అనంతరం 5వ వార్షికోత్సవ పోస్టర్స్‌ను రిలీజ్ చేశారు. విద్యార్థులకు నశా ముక్త భారత్ అభియాన్ టీ షర్ట్స్, క్యాప్స్ పంపి ణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజు, సిడిపిఓ కిరణ్మయి, వినోద్‌కుమార్, సూపర్ వైజర్స్, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల పోషణ పిల్లలదే



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదేనని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమా దేవి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని లింగగిరి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సంద ర్భంగా వృద్ధుల సంక్షేమంపై అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమం చట్టం ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదేనని, ఈ విషయంలో పిల్ల లను అడిగే హక్కు తల్లిదండ్రులకు ఉందన్నారు. తల్లి దండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో ఉన్నప్పుడు చట్టమే వారికయ్యే ఖర్చులు పిల్లల నుండి ఇప్పిస్తుందని తెలిపారు. అనంతరం ప్రతి ఒక్కరి చేత మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సోనేర్, సిహెచ్ఓ పద్మ, పిహెచ్‌సి డాక్టర్ శ్రీనివాస్, యునాని డాక్టర్ విజయ్, ఏఎన్ఎం అలివేలు, మంగ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# తక్షణమే నూతన టెండర్లు నిర్వహించాలి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట దేవ స్థానం కొండపైన షాపులకు తక్షణమే నూతనంగా టెండర్లు నిర్వహించాలని ప్రస్తుతం ఉన్న దుకాణా లను రద్దుచేసి వాటికి నూతన టెండర్లను నిర్వహిస్తే అనేకమంది కొత్తవారికి నిరుద్యోగులకు జీవనోపాధి దొరుకుతుందని బిఆర్ఎస్ యాదగిరిగుట్ట పట్టణ సెక్రెటరీ జనరల్ పాపట్ల నరహరి అన్నారు. మంగళ వారం ఆయన యాదగిరిగుట్టలో విలేకరులతో మాట్లాడారు. కొండపైన వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 40 రూపాయ లకు అమ్మవలసిన కొబ్బరికాయనును రూ.100లకు అమ్మడం దారుణమని అన్నారు. దేవస్థానం అధికా రులు కొబ్బరికాయను రూ.40కే అమ్మాలని ఆదే శాలు జారీ చేసినప్పటికీ అవి ఏవి పట్టించుకోకుండా కొండపైన వ్యాపారులు 100 రూపాయలకు కొబ్బరి కాయని అమ్మడం సరి అయినది కాదని అన్నారు. తక్షణమే దీనిపై దేవస్థానం ఈవో చర్యలు తీసుకోవా లని ఆయా షాపుల నిర్వాహకులపై దుకాణదారు లపై తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. . ఈ సమా వేశంలో బిఆర్ఎస్ పట్టణ కార్యదర్శులు ఆరే శ్రీధర్ గౌడ్, దేవ పూజ అశోక్, సీనియర్ నాయకులు పెర బోయిన సత్యనారాయణ, దండేబోయిన వీరేష్ యాదవ్, బబ్బురి వెంకటేష్ గౌడ్, కంసాని స్వామి, వాసం రమేష్, గాదపాక క్రాంతి, బుడుగే సత్తయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యాన్నదానం అభినందనీయం

**ప్రజాపక్షం / కోదాడ :** పట్టణ శ్రీఅయ్యప్పస్వామి దేవాల యంలో దాతల సహకారంతో నిత్యాన్నాదానం అభినందనీ యమని పట్టణ 19వ వార్డు మాజీ కౌన్సిలర్ కె.లక్ష్మి ప్రస న్నకోటిరెడ్డిలు అన్నారు. వారు అన్నదానానికి రూ॥ 18,116లు అందించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి వారు దాతలను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటి ప్రదాన కార్యదర్శి చల్లా రామూర్తి, కొక్కు లక్ష్మి నారాయణ, సురభి నర్సయ్య, ఈదులాపురం శ్రీనివాస్, కంచుకోముల సైదులు, రామ నాథం, గురుస్వాములు పాల్గొన్నారు.



# అన్నదానం...

**ప్రజాపక్షం/కోదాడ :** పట్టణ పరిధి హుజూ ర్‌నగర్ రోడ్డులో ప్రముఖ న్యాయవాది గాలి శ్రీనివాస్‌నాయుడు తన సోదరుడు గాలి రమేష్‌నాయుడు జ్ఞాపకార్థం సన్నిదానంలో మాలధారులకు మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా నిర్వహించి ప్రత్యేక పూజలో మురళి రెస్టారెంట్ యజమాని పాల్గొ న్నారు. సీతారాంసింగ్, గురుస్వాములు, మాలధారులు పాల్గొన్నారు.



# టెట్ నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాల్సిందే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సమాచార హక్కు చట్టం నుంచి ఉపా ధ్యాయులుగా పనిచేస్తున్న వారిని టెట్ నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాల్సిందేనని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్‌నాయక్ కోరారు. మంగళవారం మిర్యాలగూడలో బంజారా ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల తరబడి ఉపాధ్యా యులుగా పనిచేస్తున్న వారు ప్రస్తుత రిటైర్మెంట్ సమయంలో టెట్ పాస్ కావాలనే నిబంధన విధించడం సరైందికాదన్నారు. టెట్ తప్ప నిసరి అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఉపాధ్యాయులు ఆందోళ నకు గురవుతున్నారని అన్నారు. ఈనెల 19న న్యూఢిల్లీలో జరగ నున్న ఎన్‌సీటీఈ సమావేశంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోని ప్రకటించాలని కోరారు. కేంద్ర విద్యాశాఖ తెలం గాణ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లి పార్లమెంట్‌లో చట్టం చేసి టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మక్లానాయక్, శ్రీనునాయక్, లాలునాయక్, సైదానాయక్, జామ్లానాయక్ పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాల కూల్చివేత



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని గూడూరు గ్రామంలో సర్వే నంబర్ 339లో ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయిస్తున్నట్లుగా అధికారుల దృష్టికి రావడంతో మంగళవారం ఎంపీఓ శ్రీలత, ఇరిగేషన్ ఎఇ గౌరవ్ పంచాయతీ కార్యదర్శులతో కలిసి అక్రమ కట్టడాలను కూల్చి వేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా వెంచర్లు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నజీరుద్దీన్, జిపిఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# వ్యాసరచన క్విజ్ కాంపిటీషన్



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** 58వ జాతీయ గ్రంథాలయ వారో త్సవాలలో భాగంగా 5వ రోజు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వ్యాసరచన క్విజ్ కాంపిటీషన్ కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతి దేవి చిత్ర పటానికి పూలమాల అలంకరణతో కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఎండి. అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తి అధ్యక్షతన వహించినారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, డిపిఓ విష్ణువర్ధన్ రెడ్డి, డిఎంహెచ్ఓ మనోహర్, భువన గిరి పట్టణ సీఐ రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు షరీఫ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్ పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సాధనలో పాల్గొన్న ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జెఏసి రాష్ట్ర అధ్యక్షుడు ప్రఫుల్ రాంరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల జెఏసి తరపున పోరాడేం దుకు సూర్యాపేట పట్టణ అధ్యక్షులుగా కట్ట రాజన్నను నియమిం చినట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో పిడమర్తి లింగయ్య, కోడి సైదులు, కల్లెపు చంద్రన్న ప్రసాద్, మోహన్ బైరాగి, గోనె విజయ, యూసుఫ్ షరీఫ్, ఎస్‌కె సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.



## చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై శ్రద్ధ పెట్టాలని సీడీపీవో రేఖల మమత అన్నారు. మంగళవారం నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అవంతీపురం గురుకుల పాఠశాలలో ఆమె విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువు మీద దృష్టి పెట్టాలలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. రూరల్ ఎస్ఐ ఎం.లక్ష్మయ్య మాట్లాడుతూ పిల్లలు ఎవరూ మాదకద్రవ్యాలకు అలవాటు పడొద్దని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.రాధిక, బ్లాక్ కోఆర్డినేటర్ కవిత, అంగన్‌వాడి టీచర్లు సుజిత, అంజలి, మణెమ్మ, పోలీస్ స్బిబంది కీతా ఉషా, అరుణ పాల్గొన్నారు.

## కార్యాలయానికి రాని అధికారులు



**ప్రజాపక్షం/చివ్వెంల :** ప్రభుత్వ ఉద్యోగులు కొందరు విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదు. ప్రభుత్వం నుంచి మాత్రం నెల నెల జీతం తీసుకుంటున్నా బాధ్యతలను విస్మరిస్తున్నారు. మంగళవారం ఉపాధి హామీ కార్యాలయంలో ఒకే ఒక్క మహిళా ఉద్యోగి ఉండగా ఏపిఓ, టెక్నికల్ అసిస్టెంట్లు అందరూ మధ్యాహ్నం విధులకు హాజరుకాలేదు. గత కొంతకాలంగా ఇక్కడ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో ఏపిఓ ఇంకా కార్యాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకూడదని మండల ఎంపిడిఓ పి ఝాన్సీ అన్నారు. మండల పరిధిలోని కాసర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థిని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. దీనివల్ల విద్యార్థులు చదువులో రాణించక మత్తు పదార్థాలకు బానిసలుగా మారి తల్లిదండ్రులకు చెడు పేరును తీసుకురావద్దని కోరారు. చదువులో రాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ గోపి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహచారి, వెంకటేశ్వర్లు, దబ్బేటి యాదగిరి, నాగరాజు, యాదగిరి, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



# చెరువుగట్టు గుట్టపై పరిశుభ్రత పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యం కల్పిస్తాం

### పవిత్రమైన పుష్కరిణిని అపవిత్రం చేయొద్దు

### చెరువుగట్టు ఇఒ మోహన్ బాబు



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** తెలంగాణలోనే ప్రసిద్ధ శైవక్షేత్రం, తెలంగాణ శ్రీశైలం గా విరాజిల్లుతున్న నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలం చెరువుగట్టు గ్రామాన గల శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పరిశుభ్రత,పారిశుద్ధంపై చిత్త శుద్ధి తో ప్రథమ ప్రాముఖ్యతకు స్థానం కల్పిస్తూన్నట్లు ఇటీవల నూతనంగా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఆలయ ఈవో సల్వాది మోహన్ బాబు అన్నారు. మంగళవారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెర్వుగట్టు క్షేత్రానికి విచ్చేసే భక్తులు అత్యధికంగా గ్రామీణ వాసులు కావడంతో పరిశుభ్రత,పారిశుద్ధం కు అత్యంత ప్రాముఖ్యతను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న చెరువుగట్టు లో ప్రతి అమావాస్య, పున్నమి రోజులలో శివసత్తులతో భక్తులు పూజలు చేయించుకొని దిష్టి తీయించుకున్న అనంతరం స్నానం ఆచరించే విధానంలో మార్పులు చేసుకోవాలని భక్తులకు ఈ ఓ సూచిస్తూ ఫ్లక్సీ లను ఏర్పాట్లు చేయన్నున్నట్లు వివరించారు. పవిత్రమైన స్వామివారి పుష్కరిణిని పవిత్రంగాఉంచాలని, తడిబట్టలతో అపవిత్రం చేయొద్దని భక్తులకు విజ్ఞప్తిచేశారు.ఈ విధానాలను భక్తులు పాటించినట్లయితే గుండంలోని నీరు పరిశుభ్రంగా ఉంటుందని మిగతా భక్తులకు అసౌకర్యం కాకుండా ఉంటుందని తెలిపారు.అదేవిధంగా క్షేత్రంలో భక్తులకు సరిపడ మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని, బయట ప్రదేశాలలో విసర్జించవొద్దని కోరారు. గర్భ గుడిలో ఉన్న దేవుడే గుట్ట ప్రాంతమంతయు ఆవహించి ఉన్నందున భక్తులు గమనించాలని తెలిపారు. ఇదే క్రమంలో గుట్ట ప్రాంతమంతయు చెత్త కుండీలను, త్రాగు నీటి సదుపాయంను ఏర్పాటు చేశామని తెలిపారు. గుట్టకు విచ్చేసే భక్తులు ఆలయ ప్రాంగణంలో చెత్తను ఏర్పాటు చేసిన చెత్త కుండీలలో వేసి ఆలయ సిబ్బందితో సహకరించాలని కోరారు. అమావాస్యకు విచ్చేసే భక్తులు పేర్కొన్న విధానాలను తుచా తప్పకుండ పాటిస్తారని ఆశించారు.

# ప్రతీ ధాన్యం గింజకూ మద్దతు ధర కల్పిస్తాం



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం పోలెపల్లి ఎక్స్‌రోడ్డులో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పి.ఏ.సి.ఎస్) ఆవరణలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే బాలునాయక్ ప్రారంభించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒకటైన రైతు భరోసా కింద ప్రతి ధాన్యం గింజకు మద్దతు ధర కల్పిస్తూ ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ ఏడాది వరి దిగుబడి బాగున్న నేపథ్యంలో రైతులు ఎటువంటి ఆందోలన చెందాల్సిన అవసరం లేదని, నియోజకవర్గంలో ప్రతి మండలంలోనూ తగినన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నమని తెలిపారు. రైతులు సకాలంలో తమ ఉత్పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి అమ్ముకోవచ్చని తెలిపారు. 48 గంటల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతుందని హామి ఇచ్చారు. ఈ కేంద్రాల్లో ఆదునిక తేమకొలిచే యంత్రాలు, తడి తొలగింపు సౌకర్యంతోపాటు రైతులకు విశ్రాంతి తీసుకునే విధంగా మౌలిక వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. కేంద్రానికి వచ్చేముందు రైతుల తగు పత్రాలు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, పి.ఏ.సి.ఎస్ డైరెక్టర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షలు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# మునుగోడు సహకార సంఘానికి ఐఎస్ఒ సర్టిఫికెట్




**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ఐఎస్ఓ 9001: 2015 నాణ్యతా నిర్వహణ సర్టిఫికేషన్ ను హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ నుండి సాధించింది. ఈ సర్టిఫికేట్‌ను మునుగోడు ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, నల్లగొండ డిసిసిబి చైర్మన్,మునుగోడు పిఏసిఎస్ చైర్మన్ కుంబం శ్రీనివాసరెడ్డికు అందజేశారు. ఐఎస్ఓ ప్రమాణాల ప్రకారం అవసరమైన అన్ని పారామీటర్లను పరిశీలించేందుకు హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ బృందం మునుగోడు సహకార సంఘాన్ని సందర్శించింది. సమగ్ర పరిశీలన అనంతరం, పిఎసిఎస్ నిర్వహణలోని వ్యవస్థాత్మకతను సక్రమంగా నిర్మించిన ఆధునిక పిఏసిఎస్ భవనం యూరియా సహా అన్ని వ్యవసాయ అవసరాల సమర్థవంతమైన సరఫరా,రుణాల మంజూరు వసూళ్లలో పారదర్శకత వరి సేకరణ మరియు కొనుగోలు ప్రక్రియల్లో సమర్థత పిఏసిఎస్ ఆదాయాన్ని పెంచడంలో తీసుకున్న చర్యలు నిబద్ధతతో పనిచేసే సిబ్బంది అలాగే, రైతుల ప్రయోజనాల కోసం ప్రత్యేక వ్యవసాయ యంత్రాలను కొనుగోలు చేసి విధానాలను పరిశీలించి. అన్ని అంతర్గత ప్రక్రియలు ఐఎస్ఓ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నందున జిల్లాలోని మొదటగా మునుగోడు సహకార సంఘానికి అయ్యప్ప సర్టిఫికెట్ లభించిందని డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.సహకార రంగంలో ఆదర్శవంతమైన సేవలు సమర్థవంతమైన నిర్వహణతో సాధించినందుకు చైర్మన్, డైరెక్టర్‌లను సిబ్బందిని ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అభినందించారు.




## మొబైల్ ఎక్స్‌రే స్కీనింగ్ క్యాంపు

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలంలో ఏఐ ఆధారిత మొబైల్ ఎక్రే స్కీనింగ్ క్యాంపును జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ సమన్వయంతో ఎస్పీ సూచనల మేరకు చందంపేట, నేరేడుగొమ్ము, దిండి మండల పోలీస్ స్టేషన్ సిబ్బందికి క్షయ ఛాతి ఎక్రే, పలు రకాల పరీక్షలు నిర్వహించడం జరిగింది.ఈ శిబిరాన్ని స్థానిక ఎస్సై లోకేష్ ప్రారంభించి ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది పని ఒత్తిడిలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకొలని సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతోనే క్యాంపును ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు అక్కనపల్లి వసంత, లెనిన్ శ్రీనివాస్, ఎస్సైలు లోకేష్, నాగేంద్రబాబు, బాలకృష్ణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రసాయన శాస్త్రంలో శ్రవణ్ కుమార్‌కు పిహెచ్‌డి ప్రదానం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫసర్ డా రూప పర్యవేక్షణలో "డెవలప్మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ న్యూ ఆర్‌పి హెచ్‌పిఎల్ సి మెథడ్స్ ఫర్ సెలెక్టెడ్ డ్రగ్స్ ఇన్ ఫార్మసిటికల్స్ డోసేజ్ ఫార్మ్స్ అంశంపై పరిశోధించి తన పరిశోధన గ్రంథాన్ని సమర్పించి డాక్టరేట్ పట్టాను నల్లగొండ మండలం నర్సింగ్ భట్ల గ్రామానికి చెందిన శ్రవణ్ కుమార్ అందుకున్నారు.ఈ సందర్భంగా తన పరిశోధనను వివరిస్తూ ఎంచుకున్న ఔషధాల మొత్తాన్ని అంచనా వేసేందుకు స్థిరత్వాన్ని సూచించే ఆర్‌పి,హెచ్‌పిఎల్ సి విధానాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఈ పరిశోధన పలు ప్రయోజనాలను అందిస్తుందన్నారు. ఈ పరిశోధన ప్రజారోగ్యాన్ని రక్షించడంలో ఔషధాల నాణ్యతను నిర్ధారించడంలో,ఆరోగ్య వ్యవస్థను బలపరచడంలో సహాయపడుతుంది.ఈ పరిశోధన నివోలిమాబ్, రిలెట్లిమాబ్, నిరపరిబ్,అభిరెటిరోన్, రెమోగ్లిఫ్లోజిన్,టెనిలిగ్లిప్టిన్ వంటి ఔషధాలపై నిర్వహించబడిందన్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్,రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవిలు అభినందించారు.

## వయోవృద్ధుల సంరక్షణపై అవగాహన



**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండల పరిధిలోని కాసర్లపాడు గ్రామంలో వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఎంపిడిఓ ఝాన్సీ పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధులు పోషణ సంక్షేమ చట్టం 2007 ప్రయోజనాల అమలుపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. వృద్ధులు వారి కుటుంబ సభ్యులు నిర్లక్ష్యం చేసినా, వేధించినా ఈ చట్ట వారికి రక్షణ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిఓ గోపి, పంచాయితీ కార్యదర్శి నెహ్రూనాయక్, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ వృద్ధులు, మహిళలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ కోదాడ :** వృద్ధుల సంరక్షణ కుటుంబ సభ్యులదేనాని, వారి హక్కులకు భంగం వాటిన్నట్లుయితే చట్టపరమైన చర్యలు తప్పవని ఐసీడీసీ సుపర్‌వైజర్ పూజ అన్నారు. మంగళవారం పట్టణ పరిధి శ్రీరంగాపురం అంగన్‌వాడి సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇతరులకు మన బ్యాంకు వివరాలు, ఓటీపీల సమాచారం అందిచవద్దని హెచ్చరించారు. అంగన్‌వాడి టీచర్ నాగమణి, గ్రామ పెద్దలు, విద్యార్థులు, యూత్ సభ్యులు, వార్డు ఇంచార్జి రవీంద్ర పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నుండి బిజెపిలో చేరిక

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మండలంలోని చెన్నుగూడెం గ్రామ యువ నాయకుడు మర్రి ఏడుకొండల్ యాదవ్,పాతూరు గ్రామం నుండి వడ్డేపల్లి లింగస్వామి గౌడ్ పలువురు నాయకులు చామకూరి మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో పిల్లి రామరాజు యాదవ్ నేతృత్వంలో నిర్మల్ ఎమ్మెల్యే బిజెపి ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుండి బిజెపిలో చేరారు.వారికి బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పిల్లి రామరాజు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు.

## బెంగళూరులో సీమ ఫోటో జర్నలిస్ట్ అవార్డుకు భజరంగ్ ఎంపిక



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సౌత్ ఇండియా మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 6న బెంగళూరు ఎయిర్‌పోర్ట్ రోడ్డు లోని మాల్ ఆఫ్ ఆసియాలో నిర్వహించే సీమా ఉత్తమ ఫోటో జర్నలిస్ట్ అవార్డు 2025కు నల్లగొండ జిల్లా సాక్షి సీనియర్ ఫోటో జర్నలిస్ట్ కంది భజరంగ్ ఎంపికైనట్లు సీమ జనరల్ సెక్రెటరీ ఎన్.కె. స్వామి తెలిపారు. మీడియా రంగంలో విశేష కృషి చేసి అనేక అవార్డులు సాధించినందుకుగాను ఈ ప్రతిష్టాత్మక అవార్డును కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కర్ణాటక ఆంధ్రప్రదేశ్ తెలంగాణ తమిళనాడు కేరళ పుదుచ్చేరి మంత్రులు,ఉన్నతాధికారులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

## డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రజాపక్షం/సూర్యాపేట :** డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మాదక ద్రవ్యాల విముక్తి భారత దేశ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన నషా ముక్త్ భారత్ అభియాన్ ఐదేళ్ళ పూర్తి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి పోలీసు అధికారులు, సిబ్బందితో సామూహిక ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు, ముఖ్యంగా ప్రతి పోలీస్ యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్‌గా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ హరిబాబు, ఏవో మంజుభార్గవి, ఆర్ఎస్ఐలు అశోక్, సురేష్, రాజశేఖర్, సాయిరాం పాల్గొన్నారు.



## రాజేష్ మృతిపై న్యాయవిచారణ జరిపించాలి



**ప్రజాపక్షం/ కోదాడ:** సి.ఎం రిలీఫ్ ఫండ్ అవినీతి వ్యవహారంలో పోలీసుల విచారణ అనంతరం రిమాండ్‌కు పంపిన పట్టణానికి చెందిన కర్ల రాజేష్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విధితమే. నిందితుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని సమగ్ర న్యాయ విచారణ జరిపించి బాద్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని మృతుని తల్లి, కుటుంబ సభ్యులు, మిత్రులు, ధర్మ,ధర్మ సమాజ్‌పార్టీ బాద్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం పట్టణంలో బారీ నిరసన ర్యాలీని డిఎస్‌పి కార్యలయం వరకు నిర్వహించారు. అనంతరం డిఎస్‌పి ఎం.శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మృతురాలి తల్లి మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ అవకతవకలపై ఈనెల 4వ తేదిన తన కుమారుడిని చిలుకూరు పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి 8వ తేదిన హుజూరనగర్ జైలుకు పంపించారు. నిందితుడు ఆనారోగ్యంతో ఉండటాన్ని గమనించిన హుజూర్‌నగర్ ప్రథభుత్వ ఆసుపత్రికి చికిత్స తరలించి, మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్ గాంధీకి తరలించారు. ఆదివారం తన కుమారుడి శవాన్ని అప్పగించారని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. తన కుటుంబాన్ని పోషించు పెద్ద కుమారుడి మృతితో తన కుటుంబ రోడ్డు పడిందని, తమను ఆదుకోవాలని కోరారు. ఆర్డీవో సూర్యానారాయణ మాట్లాడుతూ కుటుంబానికి డబుల్‌బెడ్‌రూం ఇల్లు, మున్సిపాలటీలో కుటుంబ సభ్యులకు ఉధ్యోగం, కొంత ఆర్థికసాయం అందించేదుకు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడుతాని హామి ఇచ్చారు. వారి హామితో ఆందోళన విరమించారు. తక్షణ ఖర్చుల నిమిత్తం కోదాడ మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నంబాబు రూ॥ 50వేలు అందిస్తానాని హామి ఇచ్చారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కుందూర్ జై వీర్‌రెడ్డి అన్నారు, మంగళవారంమండల కేంద్రంలోని ఐకెపి వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఐకెపి కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేసి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని అన్నారు. అనంతరం మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయం కోసం మార్కెట్ యార్డ్ లో నాలుగు ఎకరాల స్థలం కార్యాలయం కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రతిపాదనలు పంపేమన్నారు, వారు సనుకులంగా స్పందించినందున స్థలాన్ని పరిశీలించామన్నారు, అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మూడు తరగతి గదులు శిథిల వస్త లో ఉన్నందున పాఠశాల మరమ్మతుల కోసం ఆరు లక్షల రూపాయల మంజూరు చేసిన పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ నాయకులు గడ్డం సాగర్ రెడ్డి, మాజీ ఎంపీపీ భగవాన్ నాయక్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు నాయక్ పాల్గొన్నారు.

## దుఃఖంలో మానవతను ప్రపంచానికి చూపుతున్న ప్రజలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ జిల్లా ప్రజలు మానవతను మరోసారి ప్రపంచానికి చూపుతూ వరుసగా మూడు నేత్రదానాలు విజయవంతంగా చేశారని ఐ డొనేషన్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరనాథ్ కడిమి,మేనేజర్ డాక్టర్ పుల్లారావు తెలిపారు.నల్లగొండ పట్టణంలో నన్నూరి ఆశలత,బోదనపు జ్యోతి, కంచుకోట్ల యశోద చనిపోయరు వారిముగ్గురి నుండి నేత్రదానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ముగ్గురు దాతల కుటుంబ సభ్యులు దుఃఖంలో కూడా సమాజ సేవను ముందుంచి,ఒక మంచి నిర్ణయం తీసుకోవడం నిజంగా ప్రశంసనీయం అని వారి మహోన్నత నిర్ణయం ఆరుగురు కార్నియల్ అంధులకు కొత్త జీవితాన్ని ఇస్తుంది అని తెలిపారు. ఇప్పటి వరకూ సేకరించిన 478 కార్నియా లతో 478 మందికి పైగా అంధులకు కంటిచూపును పునరుద్ధరించడం,478 మంది కంటే పైగా కుటుంబాలకు జీవనదానం కలిగించడం నల్లగొండ జిల్లా గర్వించదగ్గ విషయం అని తెలిపారు.ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ కొనకంచి విజయ కుమార్ లయన్ ఎల్ వి కుమార్ ఉన్నారు.

## ప్లాస్టిక్ కవర్లు....పశువులకు ప్రాణహాని



**ప్రజాపక్షం/కోదాడ :**ప్లాస్టిక్ కవర్లతో పశువులకు ప్రాణహాని ఉందని పశు యజమానులు తస్మత్ జాగ్రత్త వహించాలని కోదాడ ప్రాంతీయ పశువైద్య శాల అసిస్టెంట్ డైరెక్టర్ డా॥ పి.పెంటయ్య అన్నారు. మంగళవారం వైద్యశాల ప్రాంగణంలో పశుయజమానులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రజలు పలు రకల వ్యాపారస్తులు తమ వద్ద మిగిలిన వ్యర్థ ఆహార పదార్థలను కవర్లలో చుట్టి రోడ్లపై, పెంటకుప్పలపై వేస్తున్నారు. కవర్ల వలస కలుగు హాని తెలియని మూగ జీవాలు వాటిని తినడంతో వాటి ప్రాణాలకు ముప్పు ఏర్పడింది. ఇటీవల కాలంలో అనేక జీవాలకు కడుప్పు ఉబ్బరంగా ఉండటంతో వాటికి ఆపరేషన్ చేసిన సమయంలో పెద్ద మొత్తం కవర్లు బయట పడినాయి. వీటిని తిన్న పశువులు ఇచ్చుపాలు విషతుల్యంగా మారతాయని యజమానులు పశువులు కవర్లు తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు కవర్లలో ఆహార పదార్థలు ఉంచి బహిరంగ ప్రదేశాలలో వేయరాదని సూచించారు. ఈ సమావేశంలో పాడి రైతులు పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/హాలియా:** మనిషి జీవితాన్ని సర్వనాశనం చేసే మార్గద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని హాలియా మున్సిపల్ కమిషనర్ మందడి రామ దుర్గా రెడ్డి తెలిపారు. మంగళవారం హాలియాలో నాషా ముక్తభారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హాలియా లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థుల చేత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని వాటి వల్ల వచ్చే అనర్ధాలతో జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోతున్న విషయాన్ని విద్యార్థులకు తెలియజేసి వాటికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. హాలియాలోని టైం స్కూల్ కు చెందిన విద్యార్థులతో మున్సిపల్ ఆఫీసు నుండి హాలియా సెంటర్ వరకు పెద్ద ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, కళాశాల ప్రిన్సిపల్ పద్మ,ఐసిడిఎస్ సూపర్వైజర్లు సరిత,రమాదేవి,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆఫ్టర్ స్కూల్ చిల్డ్రన్స్ డే వేడుకలు



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలములోని ఖుదా బాక్స్ పల్లి గ్రామములో మంగళవారం బెతెల్ సంస్థ ఆధ్వర్యంలో ఆఫ్టర్ స్కూల్ చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.చిన్నారులతో ముఖ్య అతిథిగా వచ్చిన తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాస్ కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాను. పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ బుక్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో బూడిద కృష్ణ,టీచర్లు జ్యోతి,పుష్పలత,రాణి విద్యార్థులు గ్రామస్తులు ఉన్నారు.

## రిజర్వేషన్ల తర్వాత ఎన్నికలు జరపాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** చట్టబద్ధంగా రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ ఎంపిపి గుండగాని కవితా రాములు గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామని కాంగ్రెస్ పార్టీ పదే పదే చెప్పి ప్రజలను మోసం చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇచ్చేది ఏమిటని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచాక వాపును చూసి బలం అనుకుంటుందని విమర్శించారు.

## ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఆర్యవైశ్య కార్తీక మాస వనభోజన కార్యక్రమం పట్టణంలోని కల్వకొలను రామనాథం తోటలో జరిగింది. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించి పెద్దలకు చిన్నారులకు సాంస్కృతిక కార్యక్రమాలు ఆటల పోటీలు నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొనగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓరుగంటి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి పొలిశెట్టి లక్ష్మి నరసింహరావు, ట్రెజరర్ తొడుపునూరు శేఖర్ పాల్గొన్నారు.



# సిపిఐ జాతాను జయప్రదం చేయండి







## జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఖమ్మంలో డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ 100 వసంతాల ముగింపు ఉత్సవాలను జయప్రదం కోసం నవంబర్ 15న బాసరలో ప్రారంభమై ఈనెల 24న సూర్యాపేటకు వచ్చు జాతను జయప్రదం చేయాలని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో జరిగిన కార్యవర్గ సమావేశం పట్టణ కార్యవర్గ సభ్యులు బొమ్మగాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, దంతాల రాంబాబు, చామల అశోక్ కుమార్, ఎండి పాషా, రేగటి లింగయ్య, పెంద్ర కృష్ణ, దంతాల పద్మ, రేఖ తదితరులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ప్రచార జాత ఈనెల 20న మధ్యాహ్నా 12గంటలకు మిర్యాలగూడ మున్సిపల్ కాంప్లెక్స్‌కు చేరుకుంటుందని అక్కడ నిర్వహించే సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సీపీఐ పార్టీ 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి భారత గడ్డపై వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా వంద సంవత్సరాల పండుగను జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ మండల కార్యదర్శి అంజనపల్లి రామలింగం, మండల కమిటీ సభ్యులు బంటు రాజేశ్వరి, రమేష్, రైతు సంఘం నాయకులు బంటు బుచ్చయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భారత గడ్డపై 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 20న సాయంత్రం 5 గంటలకు భువనగిరికి సిపిఐ ప్రచార జాత విచ్చేస్తుందని, ఈ ప్రచార జాతను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్ అన్నారు. మంగళవారం భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామంలో కరపత్రాలు ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి ఉడుత రాఘవులు, శాఖ కార్యదర్శి ముదిగొండ ఠాగూర్, నాయకులు చింతల పెంటయ్య, ముదిగొండ మహేష్, మరి నరసయ్య, చిక్కబాలసురి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/గరిడేపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ వంద వసంతాలు పూర్తి అవుతున్న సందర్భంగా సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం నాయకత్వంలో ఈనెల 20న గరిడేపల్లి మండలానికి వస్తున్న ప్రచార జాతలో అత్యధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంలో ప్రచార జాతకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఎడ్ల అంజి రెడ్డి, ప్రధాని సైదులు, వెంకన్న, పంగ సైదులు, షేక్ సైదా హుస్సేన్, వెంకన్న పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మోటకొండూరు :** యాదాద్రి భువనగిరి జిల్లాలో 19 తేదీన నారాయణపురం, చౌటుప్పల్ మండలాల మీదుగా నవంబర్ 21 తేదీన వలిగొండ, గుండాల, ఆత్మకూరు, మోటకొండూరు చేరుకుంటుందని, అంబేద్కర్ చౌరస్తా రెడ్డిగట్టి శేషయ్య నగర్‌లో జరిగే బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ మండల పార్టీ కార్యదర్శి గాదగాని మాణిక్యంలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, కార్యవర్గ సభ్యులు బీరకాయల మల్లేశా, బోల శ్రీనివాస్, మండల నాయకులు జీవిలికలపల్లి గణేష్, జిలకపల్లి పాండు, బీరకాయల నరసింహ, పల్లె శ్రీనివాసు, గొట్టిపాముల సునీల్ కుమార్, బీరకాయల నర్సింహా, వస్పరి శ్రీకాంత్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో సిపిఐ బస్సు యాత్ర కరపత్రాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే హరిచంద్ర మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కొమురయ్య, జోసఫ్, వెంకన్న, కృష్ణ, హరి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునుగోడు:** సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభకు గద్వాల్ నుండి ఖమ్మం వరకు నిర్వహిస్తున్న బస్సుప్రచార జాత మునుగోడు మండల మీదుగా వస్తుందని ఈబస్సు జాతను సిపిఐ కుటుంబ సభ్యులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను కోరారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు సూరిగి చలపతి, ఏఐటియుసి మండల నాయకులు దుబ్బ వెంకన్న, బెల్లం శివయ్య ఉన్నారు.





## మాదకద్రవ్యాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** మాదకద్రవ్యాల నిరోధానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆద్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సమక్షంలో అధికారులు, ఉద్యోగులు అందరూ కలసి మాదకద్రవ్యాల నిరోధక సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ ఏ ఒక్కరు కూడా డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారు సూచించారు. గంజాయి తోపాటు ఇతర మత్తు పదార్థాలు అమ్మిన కొనుగోలు చేసిన అక్రమ రవాణా చేసిన ఆ వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, టీజేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, వైద్య శాఖ అధికారి డా.మనోహర్, జిల్లా, పలు విభాగాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** పేద ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. మంగళవారం యాదగిరిగుట్టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేసి ఎంత మంది సిబ్బంది విధులకు హాజరయ్యారని అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. డాక్టర్స్, హాస్పిటల్ సిబ్బంది రెగ్యులర్‌గా వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. సమయ పాలన పాటించి వచ్చే పేషెంట్లకు సమయానికి వైద్యం అందించాలన్నారు. ఓపి రిజిస్టర్ ని చెక్ చేశారు. ప్రతి రోజూ ఆసుపత్రికి ఎంత మంది రోగులు వస్తున్నారని ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చిన పేషంట్లతో కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది సరిగ్గా వైద్యం చేస్తున్నారా అని ఆరా తీశారు. వైద్యులు, వైద్య సిబ్బంది సకాలంలో హాజరై రోగులకు మెరుగైన వైద్య సేవలుఅందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఖాతాలలో డబ్బులు పడాలి

**ప్రజాపక్షం/చివ్వేంల :** రైతుల ఖాతాలలో డబ్బులు పడేలా చూడాలని మండల వ్యవసాయ అధికారి డి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండలంలోని తుల్జారావుపేట, ఉంద్రుగొండ ఐకెపి సెంటర్లను ఎంఏఓతో కలిసి పరిశీలించారు. వడ్లు పరిశీలించి, తేమ శాతం నిబంధనల ప్రకారం ఉంటే తూకం ప్రక్రియను వేగవంతం చేసి, మిల్లులకు పంపించాలని, ట్యాబ్ ఎంట్రీలను త్వరితగతిన పూర్తి చేయాలని సెంటర్ ఇంచార్జీలకు సూచించారు.

## నర్సయ్య మృతి తీరనిలోటు

**ప్రజాపక్షం/మోతె :** గుండెపోటుతో గంగరబోయిన నర్సయ్య మృతి చెందడం కుటుంబానికి, మత్స్య సొసైటీకి తీరనిలోటని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సిరికొండ గ్రామానికి చెందిన నర్సయ్య మత్స్య సహకార సొసైటీలో అధ్యక్షులుగా పనిచేసి సొసైటీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. మృతుని కుటుంబానికి సంతాపం ప్రకటించి సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ యం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



## అక్రమ సేవకు ఆద్యుడు అతడే?

**ప్రజాపక్షం/మోతె :** మీ సేవలో అక్రమాలకు ఆద్యుడు అతడే. గడిచిన సంవత్సర కాలం క్రితం పలు అక్రమాలకు పాల్పడి రైతులకు భూమి పట్టాలు చేయిస్తామని చెప్పి కొందరి రైతుల నుంచి లక్షలు కొల్లగొట్టాడు. ఆ వాటాలు కుదరకపోగా ఒకరిపై ఒకరు కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్ళగా తదుపరి మండల కేంద్రంలో ఉన్న మీ సేవ నిర్వాహకుడి పై విచారణ చర్యలకు ఆదేశించగా పలువురి పై విచారణ చేపట్టారు. అక్రమాలకు సూత్రదారి స్థానిక అధికారి పార్టీకి చెందిన నాయకుడని ఆ నోట ఈ నోట ప్రచారం జరగడంతో లోలోపల మండల నాయకుడుగా చెలామణి అవుతున్న నాయకుడు తన పేరును ఎక్కడ బయట పడుతుందోనని అక్రమార్కుల వద్ద సాగిలాపడి మరి పేరును పోలీసులకు గాని అధికారులకు గాని చెప్పవద్దని చెప్పినట్లు సమాచారం. మీ సేవ నిర్వాహకుడి అక్రమాలకు ఏకంగా మండల వ్యాప్తంగా రైతులు లక్షలు సమర్పించిన పనులు కావడం లేదని సదరు మీ సేవా నిర్వాహకుడిపై మండల స్థాయి ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు మీసేవా నిర్వాహకుడు డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఆ ఘటనకు సంబంధించి బాధ్యులుగా తేలిన మండల రెవెన్యూ సిబ్బందిపై, ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని డబ్బులు ఎరగా వేసిన రైతులను, తప్పుడు పత్రాలను సృష్టించిన కంప్యూటర్ ఆపరేటర్లపై అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో సుమారుగా ఏడు నెలల నుండి మీ సేవ నిర్వహించడం లేదు. తిరిగి మీ సేవను నిర్వహించడం కోసం కోదాడ శాసనసభ్యులుకు పైరవి చేసేందుకు సూత్రదారితోనే ప్రయత్నం చేయగా రైతులను మోసగించిన వ్యక్తికి ఎలా సపోర్ట్ చేస్తారని ఎమ్మెల్యే ప్రశ్నించి సదరు నాయకునిపై గుర్రుగా ఉండటం కొసమెరుపు. కాగా చేసేది లేక వెనుతిరిగినట్లు సమాచారం. అక్రమార్కులకు తిరిగి మీ సేవ ను అప్పగిస్తే సహించేదిలేదని మండలంలోని పలువురు ప్రజలు, ప్రజాసంఘాల ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు.

# సకల సౌకర్యాలతో నూతన బస్టాండ్

**- పాల్వంచ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఎల్‌ఏ కూనంనేని**



**ప్రజాపక్షం/పాల్వంచ:** సకల సౌకర్యాలతో, అన్ని హంగులతో పాల్వంచ బస్టాండ్‌ను నిర్మించబోతున్నామని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. బస్టాండ్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అసౌకర్యాలతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణీకులు కూనంనేని దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సంభంధిత అధికారులను నిలదీశారు. ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రణాళికా ప్రకారంతో ప్రయాణీకుల సౌకర్యాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. నూతన బస్టాండ్ నిర్మాణం కోసం, వసతుల కల్పన కోసం, నిధుల కోసం తగిన ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించామన్నారు. త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభం అవుతాయన్నారు. తాత్కాలిక ఉపశమనం పనులను పక్కన పెట్టి శాశ్వతంగా చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా శాశ్వత పరిష్కారం కోసం అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. నూతన హంగులతో సకల సౌకర్యాలతో పాల్వంచ బస్టాండ్‌ను ప్రయాణీకులకు అందుబాటులోకి తీసుకొస్తామని, ప్రజాల ప్రయాణాలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించటానికి మొదటి ప్రాధాన్యతను ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం కార్పోరేషన్ కమీషనర్ కే. సుజాత, డిఎస్‌పి. సతీష్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, ఆర్‌టిసి డిపో మేనేజర్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లాకార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ,వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, పాల్వంచ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సతీష్, ఎస్‌ఐలు సుమన్, జీవన్‌రాజు, నాయకులు డి. సుధాకర్, శనగారపు శ్రీనివాసరావు, చెరుకూరి శేఖర్‌బాబు, గౌస్‌పాషా, మున్సిపల్ డిఈ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులను నిలువు దోపిడీ చేస్తున్న వర్తక సంఘం వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధికి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు ఈనేపథ్యంలో స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించే ఆనవాయితీగా వస్తోంది. కాగా కొండపై ఉన్న దుకాణదారులు ఒక కొబ్బరి కాయ 100 రూపాయలకు అమ్ముతున్నారు. ఈ విషయంపై ఫిర్యాదు రాగా దేవస్థాన అధికారులు ఒక కొబ్బరి కాయ రూ.40కి అమ్మాలని లేనిపక్షంలో టెండర్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అయినప్పటికీ రెండు రోజులపాటు అధికారుల మాటపై కట్టుబడి ఉన్న వ్యాపారులు ఆదివారం నుండి తిరిగి ఒక కొబ్బరి కాయ రూ.100 అమ్మడం మొదలు పెట్టారు. దీనికి సంబంధంలేని రీతిలో సమాధానాలు చెప్పుతూ కొబ్బరి కాయతో పాటు తులసీ కూడా చేయిస్తున్నామంటూ భక్తులను నిలువెల్లా దోచుకుంటున్నారు. దేవస్థాన నిబంధనల ప్రకారం కొబ్బరి కాయ మాత్రం రూ.30 తులసిని కలిపి రూ.40లకు అమ్మవలసిందిగా గత ఈవో భాస్కర్ రావు నిర్ణయించి బోర్డులను ఏర్పాటు చేసి భక్తులకు తెలిసేలా ఏర్పాటు చేశారు. ఆ తరువాత ఈవో భాస్కర్ రావు అనంతం దేవస్థానంలో వచ్చిన అధికారులతో వర్తక సంఘం వ్యాపారులు కుమ్మక్కై సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను నిండా ముంచుతు డబ్బులు దండుకుంటున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇవే కాకుండా కొండపైన మొక్కు వస్త్రాల టెండర్ దారుడు రూ.100, పంచ రూ.300, ఫోటో రూ.100 రూపాయలు, కూల్ డ్రింక్ వాటర్ బాటిల్ పై అదనపు ధరలు తీసుకుంటు భక్తులను నానా రకాలుగా ఇబ్బందికి గురిచేస్తున్నారు. ఇప్పటికైనా దేవస్థాన ఉన్నతాధికారులు ప్రస్తుతం ఉన్న దుకాణాల టెండర్లు రద్దు చేసి కొత్త టెండర్ల ప్రకటనలు జారీ చెయ్యాలని స్థానికులు కోరుతున్నారు.

# క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్‌ను అందుకోవాలి





**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్‌ను అందుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మండల పరిధి కిన్నెరసాని గిరిజన మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన జోనల్ స్థాయి క్రీడలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముందుగా అశ్వారావుపేట, భద్రాచలం ఎంఎల్ఏలు జారె ఆదినారాయణ, తెల్లం వెంకటరావులతో కలిసి జ్యోతి ప్రజ్వల చేశారు. క్రీడాకారులచే క్రీడా జ్యోతిని అందుకొన్నారు. బెలూన్లను ఎగురవేసి క్రీడలను ప్రారంభించారు. ఆర్చరీ, వాలీబాల్ తదితర క్రీడలను ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. బాలికల 800 మీటర్ల పరుగు పందెంలో కాచనపల్లి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు మొదటి, రెండవ స్థానాలు, మణుగూరుకు చెందిన బాలిక తృతీయ స్థానాలను కైవసం చేసుకొన్నారు. వీరికి పిఓ, ఎంఎల్‌ఏలు ప్రశంసా పత్రాలను అందజేశారు. మూడవ స్థానంలో నిలచిన విద్యార్థికి ఎంఎల్‌ఏ జారె ఆదినారాయణ నగదు బహుమతిని అందజేశారు.అనంతరం జరిగిన సభలో ఐటిడిఏ పిఓ బి. రాహుల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటానికి డైట్ మెనూ కోసం 40 శాతం, కాస్మొటిక్స్ కోసం 200 శాతం పెంచిందన్నారు. దీనితో పౌష్టికాహారం అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే చదువుపై శ్రద్ధ వహిస్తారని అన్నారు. చదువుతో పాటుగా క్రీడల్లో ప్రతిభ కనభరిచి జాతీయ స్థాయికి చేరుకోవాలన్నారు. తద్వారా ఐటిడిఏకు, పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు ఐక్యతకు చిహ్నాలుగా నిలవాలన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమేనని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. ఐటిడిఏ పరిధిలోని విద్యాలయాల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు. పదవ తరగతిలో వందశాతం ఫలితాలను సాధించటానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతూ లక్ష్యాలను సాధిస్తున్నామని తెలిపారు.వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఆర్చరీ, రన్నింగ్ వంటి క్రీడలే కాకుండా నూతనంగా హాండ్ బాల్, సాఫ్ట్ బాల్, పవర్ లిఫ్టింగ్ లాంటి క్రీడల్లో విద్యార్థులకు ట్రైనింగ్ ఇస్తున్నామని అన్నారు. క్రీడల్లో మంచి ఫలితాలను సాధించటానికి క్రీడాకారులను ప్రోత్సహించి వెన్నుతట్టాలను సంభంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ డిడి , ఏటిడబ్లూఓ చంద్రమోహన్, క్రీడల అధికారి బొగ్గా గోపాల్‌రావు, పిడిలు, పీఈటిలు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ ఓవర్‌లోడ్ సమస్య పరిష్కరించాలని రైతుల వినతి



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి గ్రామంలో జాలుభాయ్ కట్ట వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్ తీవ్రంగా ఓవర్లోడ్ అవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని, మంగళవారం గ్రామ రైతులు తుర్కపల్లి మండల ఏఈ, సబ్ ఇంజనీర్‌కి వినతిపత్రం అందజేశారు. ట్రాన్స్ఫార్మర్ సామర్థ్యం సరిపోక పంటల సాగుకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతోందని, వెంటనే కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని లేదా సామర్థ్యాన్ని పెంచి తాము ఎదుర్కొంటున్న సమస్య పరిష్కరించాలని కోరారు. వినతిపత్రాన్ని అందచేసిన రైతులు రమేష్, పరమేష్, జమ్మయ్య, చంద్రయ్య, ఉప్పలయ్య, హరీష్, వీరస్వామి తదితరులు ఉన్నారు.

## ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/డిండి:** ఐదు రోజుల క్రితం అకాల మరణం పొందిన డిండి కెజిబివి టీచర్ నాగమణి స్వగ్రామం చందంపేట మండలం పొగిళ్ల గ్రామంలో మంగళవారం ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు డిండి మండల విద్యాధికారి గొప్యా నాయక్, మండల ఉపాధ్యాయులు. అనంతరం నాగమణి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల విద్యాశాఖ, ఉపాధ్యాయుల తరపున సేకరించినరూ.63వేలు నాగమణి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయంగా అందించి ఆ కుటుంబానికి చేయూత నందించారు.

## రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఖోఖో విజేతలు వీరే

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని మంగళవారం జిల్లాస్థాయి కో కో క్రీడలు మినీ స్టేడియం ఆవరణలో జరిగాయి. మొదటి స్థానం మధిర జట్టు, రెండవ స్థానం ఎర్రుపాలెం జట్టు, మూడో స్థానం చింతకాని టీములు కైవసం చేసుకున్నా యి. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి చందరరావు, ఎంఈఓ నివేదిత. మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవిలు మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు భీమ వీర రాఘవయ్య లతోపాటు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరు రాష్ట్రస్థాయిలో పాల్గొనే ఖోఖో క్రీడల్లో పాల్గొంటున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఖమ్మం :** అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మం నగరంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం లెనిన్ నగర్ ప్రాంతానికి చెందిన బహునూతల శ్రీధర్ (57) ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్న సమయంలో ఖమ్మం స్తంభాద్రి గుట్టపైకి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు ప్రణయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖమ్మం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సిపిఐ నాయకుడు తిరుమలయ్య మృతి



**ప్రజాపక్షం/వైరాః** సిపిఐ సీనియర్ నాయకుడు వైరా మండల కార్యవర్గ సభ్యులు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కౌన్సిల్ సభ్యులు తిరుమలయ్య (75) అనారోగ్యంతో మంగళవారం గొల్లపూడి గ్రామంలో మరణించారు. విషయం తెలుసుకున్న సిపిఐ నాయకులు యర్రాబాబు, యామాల గోపాలరావు, మండల పార్టీ కౌన్సిల్ సభ్యులు కార్యవర్గ సభ్యులు గొల్లపూడి గ్రామంలో తిరుమలయ్య ఇంటికి వెళ్లి తిరుమల పార్థివదేహంపై పతాకాన్ని కప్పి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యర్రాబాబు మాట్లాడుతూ కామ్రేడ్ తిరుమల నిబద్ధత ఒక కమిట్‌మెంట్ కలిగిన వ్యక్తి పార్టీ అంటే ఎంతో ప్రమ అప్యాయత సూచన వ్యక్తి తాను మరణించేంత వరకు కమ్యూనిస్టు పార్టీలో కొనసాగుతూ ఇతరులకు ఆదర్శంగా నిలబడిన వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి యామాల గోపాలరావు, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు, మండల సహాయ కార్యదర్శి మూట కొండ, రైతు సంఘం నాయకులు కొండా రామకృష్ణ, బండారుపల్లి ముత్తయ్య, ఏఐటియుసి నాయకులు రాయపూడి శ్రీను, గజ్జల శ్రీనివాసరావు, రాంబాబు, యాకూబ్‌అలి, షేక్ ఇబ్రహీం, ఓర్సు నర్సింహారావు, అమరనేని పరశురాములు, అడుసుమల్లి శివప్రసాదరావు, రేమల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## సాయిస్ఫూర్తిలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/సత్తుపల్లిః** మండల పరిధిలోని గంగారం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు నషాముక్తు భారత్ అభియాన్5(ఐదు) సంవత్సరాలు మాదకద్రవ్యాల వినియోగం, నివారణపై అవగాహన సద స్సును మంగళవారం ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్(ఐసిడిఎస్), కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ ఎస్ ఎస్) వారి సంయుక్తాధ్వర్యంలో యువతకు అత్యంత ప్రమాదకరమైన మాదకద్రవ్యాల దుర్వినియోగంపై కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ బలుసుపాటి సీతారాములు నిర్వహించారు. ఈ సమావేశంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ (ఐసిడిఎస్) సూపర్వైజర్స్ ఈ.గంగాజలం, వి.సుజాత, ఆర్. రజనీ, ఎన్ రమాదేవి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.వూటుకూరి శేషారత్నకుమారి, కళాశాల సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగాధిపతి డా. షేక్.మీరాసాహెబ్, అన్నీఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బలుసుపాటి సీతారాములు, కార్యాలయ సిబ్బంది ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు